క్లుప్తంగా

మోకాళ్లపై నిలబడి నిరసన



నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, ఇంజినీరింగ్ విభాగ కార్మిక సంఘ నాయకులు నాగరాజు ,శీనయ్య, కాలేషా పాల్గొన్నారు.

క్యాన్సర్‌స్క్రీనింగ్ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

తడ: మండలంలోని తడ, రామాపురం పీహెచ్‌సీల వద్ద గురువారం స్విమ్స్ (తిరుపతి) ఆస్పత్రి బృందం రెండు పింక్ బస్సుల్లో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించింది. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై తొలుత ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు పురుషులకు నోటి క్యాన్సర్, మహిళలు, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నిర్ధారణకు మమ్మోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలు చేశారు. స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు, తడ, రామాపురం వైద్యులు కిషోర్ కుమార్, మస్తానయ్య, విశ్వంత్, స్విమ్స్ వైద్యులు చైతన్య భాను, పద్మావతి తదితరులు శిబిరంలో పరీక్షించారు. సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, రామాపురం సర్పంచ్ టీకే శ్రీనివాసన్ పాల్గొన్నారు.

'తొలి అడుగు'లో ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

నాయుడుపేటటౌన్: సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి గ్రామాల్లో పర్యటిస్తున్నట్టు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మేనకూరు, భీమవరం, మాబాక ద్వారకాపురం, కోనేటి రాజుపాళెం, తిమ్మాజికండ్రిగ, వద్దిగుంట కండ్రిగ గ్రామాల్లో ×సుపరిపాలనలో తొలి అడుగు× కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. పలుచోట్ల గ్రామస్తులు ఆమెకు సమస్యలు నివేదించారు. భీమవరంలో గర్భిణులకు ఎమ్మెల్యే సామూహిక సీమంతాలు చేశారు. తహసీల్దార్ రాజేంద్ర, ఎంపీడీఓ సురేష్‌బాబు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, వివిధశాఖల అధికారులు, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, ఎంపీటీసీ చెన్నకేశవులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీకి కుర్చీల వితరణ

రాపూరు: స్థానిక సీవీకే ప్రభుత్వ జూనియర్ కాలేజీకి ఆర్‌ఎంపీ గజరా వేణుగోపాల్, ఆయన తనయుడు గజరా పెంచల సాయి కిశోర్ రూ.5వేల విలువ చేసే కుర్చీలను గురువారం వితరణ చేశారని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. పూర్వ విద్యార్థులు ఈ సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి సాయికిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వర్షంతో రైతులకు ఊరట



వర్షానికి పచ్చగా కళకళలాడుతున్న వరి పైరు

చిట్టమూరు: మండలంలో గురువారం కురిసిన వర్షానికి ఎడగారు రైతులు హర్షం వ్యక్తం చేశారు. అరవపాళెం, బయ్యావారికండ్రిగ, ఆరూరు, తాడిమేడు, చిట్టమూరు, బయ్యావారి కండ్రిగ గ్రామాల్లో రైతులు ఎడగారులో బోరు నీటి ఆధారంగా వరి సాగు చేస్తున్నారు. తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో వరి పైరు కళకళలాడుతోంది. మండలంలో 28.8 మిమీ వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. వర్షపు నీరు వల్ల పైరు ఏపుగా పెరిగి, దిగుబడి కూడా పెరుగుతుందని రైతులు చెప్పారు.

'బాబు' హామీలను ప్రజల్లో ఎండగడుదాం



హాజరైన నాయకులు, కార్యకర్తలు



గూడూరు రూరల్: మాట్లాడుతున్న ఉమ్మడి నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

- ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను చాటిచెబుదాం
- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'లో నేదురుమల్లి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మాదిగ, మాజీ ఎమ్మెల్యే కిలివేటి పిలుపు

రాపూరు/సైదాపురం/గూడూరు రూరల్/దొరవారిసత్రం: ఎన్నికల సమయం చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నెరవేర్చకపోవడంతో అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని హామీలతో ఎంతగా ప్రజలను వంచించాడో ప్రజల్లో ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం రాపూరు మండలం సంక్రాంతిపల్లె సమీపంలో, సైదాపురం మండలం చాగణంలో, గూడూరులోని సీఆర్ రెడ్డి కల్యాణ మండపంలో, దొరవారిసత్రంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. బాబు హామీల మోసాలపై క్యూఆర్ కోడ్‌ను పార్టీ నేతలతో కలిసి నేదురుమల్లి, ఎమ్మెల్సీలు, కిలివేటి తదితరులు ఆవిష్కరించి మాట్లాడారు. అధికారమే పరమావధిగా ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకపోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. తమ ప్రభుత్వ పాలనలో ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తే, వాటిని చంద్రబాబు నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. రేషన్ సరుకులు, పింఛన్ల కోసం లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, నిరుద్యోగభృతి పేరిట యువతను, ఉచిత బస్సు ప్రయాణం పేరి మహిళలను, పెట్టుబడి సాయం పేరిట రైతన్నలను దగా చేశారని దుయ్యబట్టారు. బాబు చేసిన ఈ వంచన, దగా, మోసాన్ని ఇంటింటికీ వెళ్లి చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినా, నిలదీసినా అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకుందని, వీటికంతా భయపడే ప్రసక్తే లేదన్నారు. పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టే అధికారులపై న్యాయపరంగా వెళ్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, కంభం విజయభాస్కర్ రెడ్డి, మాలకొండారెడ్డి, అబ్బిరాజు, సుబ్రమణ్యం తదితరులు ప్రసంగించారు. మండల కన్వీనర్లు బొడ్డు మధుసూదన్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, జిల్లా సెక్రటరీ, ఆర్గనైజర్ దందోలు లక్ష్మీనారాయణ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, రాపూరు మండల ఉపాధ్యక్షులు పెంచలరెడ్డి, పార్టీ నేతలు కలపాటి మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మనోహర్‌స్వామి, వెంకటసుబ్బయ్య, గుంటమడుగు శ్రీనివాసులురాజు, కమలపూడి సుబ్బారెడ్డి, సైదాపురం వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, యోగిరాజు, బట్టేపాటి దయాకర్‌రెడ్డి, శివకుమార్, మోహన్‌రావు, ఎం.భరత్, బీఎస్ యాదవ్, చిరంజీవి, చీర్ల బ్రదర్స్, నారాయణరెడ్డి ,సుబ్బరాజు, శ్రీనివాసులురాజు, నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయ కుమార్‌రెడ్డి, సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, చేవూరు విజయ మోహన్‌రెడ్డి, పేర్నేటి కోటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి భక్తవత్సల్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మెట్టా రాధాకృష్ణారెడ్డి, బత్తిని విజయకుమార్, గూడూరు ఎంపీపీ గురవయ్య, జెడ్పీటీసీలు యామిని, రామకృష్ణ, గూడూరు పట్టణ, రూరల్, చిల్లకూరు, కోట, చిట్టమూరు మండలాల అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, యువజన రాష్ట్ర కార్యదర్శి సునీల్‌రెడ్డి, దొరవారిసత్రం మండల కన్వీనర్ అల్లూరు రాహుల్‌రెడ్డి, నాయకులు మునస్వామినాయుడు, రాజగోపాల్, దయాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మురళినాయుడు, వేమురెడ్డి, ప్రసాద్, శివారెడ్డి, తదితరులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.



రాపూరు: హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



రాపూరు: మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



సైదాపురం: హాజరైన కార్యకర్తలు,నేతలు



దొరవారిసత్రం: చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలకు సంబంధించి క్యూ ఆర్ స్కాన్‌ను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి, నాయకులు

నియామకం



సుధీర్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

చిట్టమూరు: వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడిగా చిట్టమూరు మండలానికి చెందిన మాచిరెడ్డి సుధీర్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం గూడూరులో నిర్వహించిన ఆయనను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ కండువాతో సత్కరించారు. తనపై నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

బీఎల్‌ఓలకు శిక్షణ

కలువాయి(సైదాపురం): కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో వెంకటగిరి నియోజకవర్గం బీఎల్‌ఓలకు గురువారం మాస్టర్ ట్రైనర్ సైజుద్దీన్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుదర్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

'అక్కడ గ్రామ బహిష్కరణ చేయలేదు'

వాకాడు:మండలంలోని మొనపాళెంలో ఓ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారంటూ రెండు రోజులుగా జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని తహసీల్దార్ రామయ్య చెప్పారు. గురువారం తహసీల్దార్ తోపాటు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్‌ఐ నాగబాబు ఆ గ్రామంలో పర్యటించి విచారణ చేశారు. భూ ఆక్రమణల వివాదం నేపథ్యంలో గ్రామం ఒక్కటై తమ కుటుంబాన్ని వెలివేశారని ఆశిరెడ్డి కుటుంబం పేర్కొనడంపై చేసిన విచారణలో వాస్తవం లేదని తేలిందన్నారు. ఆక్రమణ దారులకు నోటీసులు ఇవ్వనున్నట్టు చెప్పారు.

బస్సుల కండీషన్ బాగుండాలి

వాకాడు: ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కానున్న నేపథ్యంలో బస్సుల కండీషన్ బాగుండాలని ఆర్టీసీ తిరుపతి డీపీటీఓ జగదీష్ వాకాడు ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. గురువారం సాయంత్రం వాకాడు డిపోను సందర్శించిన అనంతరం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. డీఎం పెంచలయ్య, ఏఎంఎఫ్ నారాయణ, ఎస్‌టీఐ రఘురామయ్య, పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'పై అవగాహన కల్పించండి

కలువాయి(సైదాపురం): అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయకులు శివనాయక్ ఆదేశించారు. గురువారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో ఆయన సమీక్షించారు. ఏఓ కళారాణి, ఏఈఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

–గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హెచ్చరిక

దక్కిలి: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హెచ్చరించారు. మండలంలోని పలుగోడులో సర్వే నంబరు1లో దాదాపు ఆక్రమణకు గురైన 6.30 ఎకరాల వివాదాస్పద భూములను గురువారం తహసీల్దార్ శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఆక్రమణలపై ఓ వర్గం గూడూరు డివిజినల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీకి ఫిర్యాదు చేయడంతో సబ్ కలెక్టర్ ఆ భూములను పరిశీలించారు. ఇరు వర్గాలతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించి ఇరువర్గాలు ఆక్రమించిన భూమి రెవెన్యూ ఫారెస్ట్ భూమి అని తేల్చారు. ఈ భూముల్లో ఎవరూ ప్రవేశించకుండా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సర్వేయర్ పెంచలయ్య, వీఆర్వో ఆమని పాల్గొన్నారు.



పలుగోడులో రికార్డులను పరిలిస్తున్న సబ్ కలెక్టర్

బాల్య వివాహాలు అనర్థదాయకం



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, ఐసీడీఎస్ అధికారులు

చిల్లకూరు: బాల్య వివాహాలు ఎన్నో అనర్థాలకు దారి తీస్తాయని చిల్లకూరు వైద్యులు తేజస్విని హెచ్చరించారు. మండలంలోని పారిచెర్లవారిపాళెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఆడపిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేస్తే చిన్న వయస్సులోనే శారీరక, మానసికపరంగా ఎదురయ్యే సమస్యలను విపులీకరించారు. గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ మహబూబీ, సూపర్‌వైజర్లు రేణుక, హెల్త్ సూపర్‌వైజర్లు రవికుమార్, అన్నపూర్ణమ్మ, పంచాయతీ కార్యదర్శి దివ్య, సీహెచ్‌ఓ ప్రత్యూష, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు షాకీరా, క్రిష్ణమ్మ, జరినా, లక్ష్మి, హరిత పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు మేత పొరంబోకు భూములు ఎలా ఇస్తారు?

చిల్లకూరు: గ్రామాలలో ఉండే మేత పొరంబోకు భూములను టిడ్కో ఇళ్లకు ఎలా కేటాయిస్తారని తీపనూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కన్నా రవి ప్రశ్నించారు. తీపనూరు గ్రామ పంచాయతీకి చెందిన మేత పొరంబోకు భూములు సుమారు 30 ఎకరాల వరకు ఉన్నాయని, వీటిని గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో గ్రావెల్ తవ్వకాలకు స్వాధీనం చేసుకోవాలని యత్నిస్తే కోర్టును ఆశ్రయించి వాటిని కాపాడుకున్నామని అన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆ భూములను టిడ్కో ఇళ్లు కట్టేందుకు తీసుకుంటున్నట్లు గ్రామంలో దండోరా వేయించారని, దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తహసీల్దార్, గూడూరు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇస్తామన్నారు. మేత పొరంబోకు భూములను కాపాడుకుంటామన్నారు.

నేడు చిల్లకూరులో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో'

పెళ్లకూరు: మండలంలో చిల్లకూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' అంశంపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గురువారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

వైద్యానికి ఆర్థిక సాయం




నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నాయుడుపేటటౌన్: అనారోగ్యంతో మంచానికే పరిమితమైన పేద కుటుంబానికి చెందిన కల్యాణం శ్రీకాంత్‌కు చికిత్స నిమిత్తం బలిజ చేయూత ఫౌండేషన్ గురువారం రూ.9 వేలను సాయంగా అందజేసింది. కార్యక్రమంలో ఫౌండేషన్‌కు చెందిన పగడాల శివ ప్రదీప్, హంసా పృథ్వీచంద్, నీలం హరికృష్ణ, వీ.సునీత తదితరులు పాల్గొన్నారు.

20న ఆడికృత్తిక వేడుకలు

చిట్టమూరు: మండలంలోని అరవపాళెంలో వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో 20వ తేదీ ఆదివారం ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నల్లారెడ్డి సుందర రాజారెడ్డి తెలిపారు.

కరెంటు షాక్‌తో గేదె మృతి



దక్కిలి: కరెంటు షాక్‌కు గురై గేదె మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని పలుగోడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆదిరెడ్డి బాలకృష్ణారెడ్డికి రూ.50వేల విలువ చేసే గేదె ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ వైరు తగలడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరారు.

ఓటర్ల నమోదులో బీఎల్‌ఓలే కీలకం



సర్టిఫికెట్లు అందుకున్న బీఎల్‌ఓలతో తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు: ఓటర్ల నమోదులో బీఎల్‌ఓలే కీలకంగా వ్యవహరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో గురువారం మండలంలోని అన్ని పంచాయతీల బీఎల్‌ఓలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడారు. త్వరలోనే హౌస్ హోల్డ్ సర్వే చేయనున్న వారితో పాటు బీఎల్‌ఓలు వెళితే ఓటర్ల జాబితాపై పట్టు సాధించవచ్చన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్‌ఐ పూర్ణచంద్ర, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కండలేరులో 29.513 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 29.513 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1680, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 100, మొదటిబ్రాంచ్ కాలువకు 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.